


# స్తన్యం

— ఎమ్.వి.వి. సత్యనారాయణ

**జయశ్రీ యిరుక్కున్న సమస్య అలాంటి యిలాంటి సమస్య కాదు. నిండు గర్భిణీలాగా వున్న బస్సులో ప్రయాణీకులంతా తన సౌందర్యాన్ని పరీక్షిస్తూండగా తను బాబిగాడికి రొమ్ము కుడపాలి! షీర్ నాన్సెన్స్! ఇంతకంటే ఘోరం లేదు.**

తానెక్కడ! తన సౌందర్య మెక్కడా! ఆఫ్టరాల్ పిల్లవాడికి పాలివ్వడం కోసం దాన్నంతటినీ బలి పెడ్తుందా! పుట్టినప్పట్నుంచీ ఇరవై రెండేళ్లపాటు కాపాడుకుంటూ వచ్చిన సౌందర్యమంతా బస్సులో ప్రదర్శించి కేవలం పాలుగుడిపి దాన్నంతా నాశనం చేసుకోవాలా! అక్కడికీ తన పర్సనల్ బ్యూటీషియన్ హెచ్చరిస్తూనే వచ్చింది.

"మాడం! మీరు నెల తప్పుతున్నారేమో! యూరిన్ టెస్ట్ చేయించుకుంటారా!" అని.

"నీ కెందుకలా అనిపిస్తోంది!" అడిగింది తాను.

పెళ్లయ్యి రెండేళ్లుగా గర్భ నిరోధక మాత్రలు వాడుతున్నదయ్యే. వాటిని వాడుతోన్నంతసేపూ తను తల్లి కావాలన్నా కాలేదు. అదీ తన ధీమా!

"నిరపించిపోతున్నారు మాడం!" అంది బ్యూటీషియన్.

నోరంతా పుల్లగా కావడం, అన్న హితవు లేక పోవడం, ఉదయం లేచేసరికి నిస్త్రాణా, యివన్నీ వేరే కారణాల వల్ల అని పొరబడింది తాను. మూడో నెల్లో యిల్లంతా టామ్ టామ్ చేసింది పనిపిల్ల. ఇంకే ముంది! అత్తగారు హడావుడి చేసి అబార్షన్ చెయ్యించుకోకుండా వెయ్యి కళ్లతో తాను కాపలా వుండి తన బంధువర్గాన్ని సైతం బరిలోకి దింపింది.

జ్ఞానేశ్వర్ మరీనూ! అసలు జ్ఞానం లేకుండా ప్రవర్తించాడు.

"నువు బంగారం ముద్దవి! మనకి పిల్లలు పుడితే బంగారు కణికెల్లాగా వుంటారు జయా!" అని పట్టు కున్నాడు. అసలే మొండిమనిషి! పైగా ఫామిలీ డాక్టర్ కూడా తను తల్లి కావడానికి పచ్చజెండా వూపింది.

పెద్ద కుటుంబాల్లో యిష్టాయిష్టాల కంటే సంప్రదాయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయి. వంశోద్ధరణకి పిల్లల్ని కని పారెయ్యాలి. ఒంటి నునుపంతా గోవిందో గోవిందా అయిపోయినాసరే! పిల్లలకి చాకిరీ చేసి ఒంటిని కష్టపెట్టుకోవలసిన అవసరమేమిటి! అంతకీ పిల్లలవసరమనుకుంటే ఎప్పుడో నిదానంగా కనవచ్చు. కంగారేమిటి?

పిల్లల్ని కనడానికి ఒకటే పద్ధతైతే కనకుండా వుండటానికి లక్షా తొంభై పద్ధతులు! రేడియోలో, టి.వి.లో. పత్రికల్లో ఘోషపెడ్తోంది సర్కార్. అక్కడికీ జ్ఞానేశ్వర్ ప్రతీ రాత్రీ సతాయించేవాడు.

పిల్లలు తొందరగా ఎదిగిరావాలట!

ఎందుకట! మనకేం తక్కువట!

తన ప్రశ్నకి మరల జవాబు చెప్పలేదు. జ్ఞానేశ్వర్. కానీ తనకి అతడేం చెబుతాడో పూర్తిగా తెలుసు!

పెద్దవాళ్లు కనమంటున్నారు. అంతే!

ఘోరం! సమస్తం పెద్దవాళ్ల చేతుల్లోనే ఒప్ప చెబుతూ చివరికి సెక్స్ జీవితం కూడా వాళ్లు జీవించమన్నట్టే జీవిస్తే యిక వ్యక్తిగత యిష్టాయిష్టాలకు తావెక్కడ! ఏమైతేనేం బిడ్డను కనేవరకూ వదల్లేదు అత్తగారు. బాగా జిద్దు మనిషి అత్తగారు!

పిల్లవాడికి పాలు కుడపమంటుంది. డబ్బా పాలు వద్దట! చివరికి జ్ఞానేశ్వర్ విడి కాపురం పెట్టాక అది కాస్త సద్దుమణిగింది. అంత పోరాట చరిత్ర కలిగిన పాలపోషణ యిప్పుడు నిండు రద్దీ వున్న బస్సులో సిన దశను పొందనుందా!

జయశ్రీ తల దించుకుంది.

అందరూ తనవైపే ఎక్స్‌రే కళ్ళతో చూస్తోన్న అనుభూతి! ఒళ్ళు జలదరిస్తోంది. బాబు గుక్కపట్టి ఏడుస్తోనే వున్నాడు.

అసలు తాను బయల్దేరనంది. అయినా బయ ల్దేరడం దిక్కుమాలిన బస్సులోనా? ఏం దిక్కుమా లిన వూళ్లో? దిక్కుమాలిన రోడ్లు.

"పాలియ్యవమ్మా!"

ఉలిక్కిపడి తలెత్తింది జయశ్రీ.

ఒక నిండు ముత్తయిదువ తన వైపే చూస్తోంది. పరీక్షలో కాపీకొట్టే విద్యార్థిని గదమాయిస్తోన్న వాచర్‌లాగా!

బిడ్డను సముదాయించాలని ప్రయత్నించింది జయశ్రీ. పట్టుపట్టిన విక్రమార్కుడిలాగా వాడు గుక్కపెట్టిన వాడు పెట్టినట్టే వున్నాడు. జయశ్రీ చిరాకుగా చూసి పక్కకి తిరిగింది.

పనిపిల్ల తోడొస్తోంది కాబట్టి సరిపోయింది. తన యిబ్బంది కనిపెట్టినట్టుంది. బుట్ట యివతలకి తీసి పాలపొడిలో వేడి నీరు కలుపుతోంది. ప్లాస్టిక్ సీసాలోంచి పంచదార తీసి పాలలో కలిపి పట్టుకుంది.

బాబును వూరుకోబెడ్తూ జయశ్రీ పాలు గ్లాసందుకుంద. వేడిని సమతూకంగా చూసు కుంటూ బాబుచేత తాగించింది.

నిండు ముత్తయిదువ అంకిళ్లు నొక్కుకుంది. జయశ్రీ అటు చూడకూడదనుకుంటూనే చూసింది. ముత్తయిదువ కళ్లు జయశ్రీ బ్లవుజ్ మీదే అతుక్కుపోయాయి.

"పాలు పడలేదా అమ్మాయ్!" అడిగింది ముత్తయిదువ.

ఒంట్లోంచి కంపరం జరజర జారి అరికాలిమంట నెత్తికెక్కుతోంది. అయినా జయశ్రీ ఓర్చుకుంది.

అన్ని సంగతులూ ఆడవాళ్లకే కావాలి! నోరు మూసుకుని ప్రయాణం చెయ్యరు. అడగవలసిన ప్రశ్న లేదు. అడగరాని ప్రశ్న లేదు.

ఇదే ప్రశ్న కాదు కాని యిలాంటి ప్రశ్నే బ్యూటీ పార్లర్‌లో కొత్తగాచేరిన అమ్మాయి కూడా వేసింది.

అది కూడా ఈ రోజు ఉదయమే!

జయశ్రీ ఉదయం ఎనిమిది గంటలకు బ్యూటీ పార్లర్‌కి వెళ్లింది. బ్యూటీషియన్ మాలతి ఆమె కెదురు వచ్చింది.

"రండి మాడం!" అంది మాలతి.

జయశ్రీ నవ్వుతూ వెళ్లి — పార్లర్‌లో తెరల చాటు గదిలోకి చేరుకుంది. సోఫాలో కూర్చుంది. ఎయిర్ కూలర్ చల్లదనం పంచుతోంది. చెమట ఆర్చుకుపోయి ఒంటికి ఉల్లాసం అందుతోంది.

ఒక అమ్మాయి చకచక లోపలికి వచ్చింది. నవ్వుతూ జయశ్రీకి నమస్కారం పెట్టి దగ్గర్లో వినయంగా నిలబడింది.

"కొత్త అమ్మాయా?" అడిగింది జయశ్రీ.

"అవును మాడం!" అంది మాలతి.

జయశ్రీ మెల్లగా దుస్తులు మార్చుకుని షార్ట్స్‌లోకి మారింది. బల్లమీద వెల్లకితలా పండుకుంది. క్రీములూ, ద్రవాలూ, బ్రష్షులూ, పట్టీలూ సిద్ధం చేసింది అమ్మాయి. మాలతి పర్యవేక్షిస్తోంది.

మెడ చుట్టూ మలాం రాసి సున్నితంగా మెడకు రెండు ప్రక్కలా పైకీ ప్రక్కలకూ ఒత్తుతోంది. మొహం మీద చెమట బిందువు లారిపోయినచోట సున్నితంగా టర్కిష్ టవల్‌తో ఒత్తుతోంది ఆ అమ్మాయి. షార్ట్స్‌ను నెమ్మదిగా కిందికి జరిపి ట్రెపీజయస్‌ను సున్నితంగా మసాజ్ చేస్తోంది.

ట్రెపీజియస్ మీద మెడ నిలబడిన చోటు!

మెడ కటూ యిటూ రెండు పాయింట్స్!

ఆ అమ్మాయి మృదువుగా ఆ పాయింట్స్ మీద రెండు వేళ్లతో రాస్తూ కొద్ది కొద్దిగా ఒత్తుతోంది. జయశ్రీకి రక్తనాళాల్లో ఉత్తేజం ప్రారంభమయింది.

జయశ్రీ మొహం వద్దకు చేతులు తీసుకు వచ్చింది ఆ అమ్మాయి. మొహం మీద అణువణువూ మెల్లగా అదుముతూ పైకి పోనిచ్చి వేళ్లను ఆ ప్రక్కకీ యీ ప్రక్కకీ పోనిస్తోంది. తర్వాత ఆల్మండ్ క్రీమును వేలితో కొద్ది కొద్దిగా అందుకుంటూ మొహమంతా చింతాకులు పరచినట్టు పరుస్తోంది. క్షణాలాగి ఆల్మండ్ క్రీము తరకల్ని ఒకదానితో ఒకటి కలుపుతూ మొహమంతా ఒక మీగడ పొర నద్దింది. కనుబొమల మీద నిలబడిన రవ్వంత క్రీమును మెల్లగా టర్కిష్ టవల్‌తో అద్ది ఒక చిరునవ్వు నవ్వింది.

> ఓ పేషెంట్ చికిత్స కోసం ఓ డాక్టర్ దగ్గరికెళ్ళాడు. "ఆ... ఏమిటయ్యా నీ జబ్బు? ఎన్నాళ్ళ నుంచి బాధ పడుతున్నావ్?" అని అడిగాడు డాక్టర్.
>
> పేషెంట్ తలవంచి — "ఇదిగో చూడండి, మెడ అర మీటర్ సాగిపోయింది. ఇది తగ్గడానికి మందులు రాసివ్వండి" అన్నాడు పేషెంట్.
>
> మెడని చూసి ఆశ్చర్యపోతూ డాక్టర్, "అసలు నీ మెడ ఇలా ఎలా పొడుగ్గా సాగిపోయిందయ్యా?" అడిగాడు.
>
> "హత్యా నేరానికి నన్ను ఉరి తీసారండీ! నేచావలేదు గానీ మెడసాగింది' ' అన్నాడు పేషెంట్ — భోశ్రీ

"భగవంతుడు అందమంతా మీకే యిచ్చాడమ్మా!" అందా అమ్మాయి.

అమ్మాయి చేతులు ఆమె శరీరం మీద కిందికి దిగుతున్నాయి. ఛాతీ మీద అతి నైపుణ్యంగా మసాజ్ చేస్తున్నాయి. ఉన్నట్టుండి అమ్మాయి చేతులు జయశ్రీ శరీరం మీద నుండి తప్పుకొన్నాయి.

షార్ట్స్ తడిశాయి. ఛాతీ మీద అద్దిన మలాం ఆ తడికి కరుగుతోంది. షార్ట్స్‌ను తడిపిన ద్రవమేమిటో ఆ అమ్మాయి కర్థమైనట్టుంది.

జయశ్రీ కింకా తన గుండెల మీద మలాం కరగిన సంగతి తెలియలేదు. అందువల్లే ఆమె మామూలుగా చూస్తోంది.

మసాజ్ చేసే అమ్మాయి సిగ్గుగా చూసి, "అమ్మగారూ! మీకు బాబా! పాపా!" అంది.

"బాబు!"

"మిమ్మల్ని చూస్తే బాబు పుట్టినట్టుండదమ్మగారూ!" ఆమె కళ్లకింద వలయాలు త్రిప్పింది అమ్మాయి.

జయశ్రీ పొంగిపోయింది. అలా కనిపించాలనే తన కోరిక కూడా! తన శరీర లావణ్యాన్ని కాపాడుకునే పద్ధతే అంత! లేకపోతే బిడ్డతల్లుల్ని చూడరాదూ! ఒక్క కాన్పుతో అంతా పోయినట్టు డీలా పడిపోతారు.

తానింక బిడ్డలను కనదు కానీ మరో నలుగుర్ని కనినాసరే తన ఒళ్లు యిలాగే వుంచుకుంటుంది. ఆ రహస్యం అందరికీ తెలియదు.

"ఇక్కడికి బయల్దేరే ముందు బాబుకి పాలివ్వలేదా అమ్మగారూ?"

జయశ్రీ ఆ పిల్ల వైపు అదో రకంగా చూసింది. అచ్చంగా కౌశికుడి చూపు! కలికాలం కావడం వల్ల చూపులో నిప్పులు కురవకపోవడం, ఆ అమ్మాయి అర్భకపు కొంగలాగా మాడిపోకపోవడం జరిగిపోయాయి.

బ్యూటీషియన్ మాలతి కలగచేసుకోవడం కూడా ఆ అమ్మాయి భస్మం కాకుండా కాపాడగలిగింది.

"బుద్ధిలేదటే నీకు?" అమ్మగారు నీ కెలా కనిపిస్తున్నారు? పాలిచ్చి పెంచితే తప్ప బిడ్డకు ఆసారం యివ్వలేనంత హీన స్థాయిలో వున్నారంటావా? పాలివ్వడం వల్ల శరీర లావణ్యం చెడిపోదూ!" అంటోందే కాని మాలతి గొంతులో ఒక జంకు!

అమ్మాయికి మతి పోయింది. మాలతి మాటలు ఆమె కర్థం కాలేదు. వెనకబడిన కుటుంబం నుండి వచ్చిన కారణంగానో, తన యింటి చుట్టూ తమ బిడ్డల్ని పాలిచ్చి పెంచే తల్లులుండటం వల్లనో, ప్రకృతి ధర్మం ప్రకారంగా కన్నబిడ్డకు పాలిచ్చి పెంచడం ఒక హక్కులాగా, సార్థక్యం లాగా భావించే ఆడజాతికి చెంది వుండటం వల్లో మసాజ్ అమ్మాయి మొహం చిన్నబుచ్చుకుంది.

జయశ్రీ కదంతా తనకి సంబంధించినట్టు తోచలేదు. మెల్లగా లేచి షార్ట్స్‌ను గుండెల మీద సర్దుకుని వాష్ బేసిన్ వైపు కదిలింది.

మసాజ్ అమ్మాయి ఆమె వైపు చూస్తోంది.

వాష్ బేసిన్‌లోకి వంగింది జయశ్రీ.

రెండు చేతుల్తోనూ పాలు పిండి శరీరం శుభ్ర పర్చుకుని నిలబడిపోయింది. మసాజ్ అమ్మాయి తేరుకుని జయశ్రీకి వేరే షార్ట్స్ అందించింది.

జయశ్రీ ఇంటికి తిరిగి వచ్చిందన్న మాటేకాని ఆ అమ్మాయి ప్రదర్శించిన తల్లిపాల గురించిన అజ్ఞానం గురించి తల్చుకుని తల్చుకుని నవ్వుతోంది.

'నువు దంతపు బొమ్మలాగా వుంటావు జయా!' అంటాడు జ్ఞానేశ్వర్.

నిపుణుడైన శిల్పి తన చాతుర్యం మొత్తాన్ని తేనెలో నుంచి లావణ్యాన్ని పోతపోసినట్టుంటుంది తాను. ఈ మాట కూడా జ్ఞానేశ్వరే అన్నాడు. తన శరీరంలో ఎక్కడ గిచ్చినా సౌందర్యం తునకతునకగా రాల్తుంది. ఆ సంగతి తనకు తెలుసు.

జ్ఞానేశ్వర్ హడావుడిగా యింటికి వచ్చాడు. అతడి మొహం చూస్తే ఎక్కడెక్కడో తిరిగి అలసిపోయినట్టుంది. ఒక నిర్ణయానికి రాలేక తల్లడిల్లిపోయినట్టూ వుంది.

జ్ఞానేశ్వర్ వస్తూనే ఆమెకు టెలిగ్రాం అందించాడు.

అదెక్కడి నుండి వచ్చిందో జయశ్రీ కర్థమైపోయింది. జ్ఞానేశ్వర్‌కో మేనత్త వుంది. ఆమె రేపో మాపో అన్నట్టుంది. ఆమె గురించే జ్ఞానేశ్వర్ గాభరా పడ్తూంటాడు. జ్ఞానేశ్వర్ చిన్నతనంలో ఆమె వద్దే పెరిగాడు. ఆమెకు వెనకా ముందూ ఎవరూ మిగల్లేదు. అయిదెకరాల మాగాణీ ఏడెనిమిది లక్షల కాష్, పల్లెటూళ్లో లంకంత లోగిలీ — ఇవన్నీ జ్ఞానేశ్వర్‌కి రాసిందామె.

ముసలావిడ చివరి కోరికల్లా లంకంత లోగిట్లో కన్నుముయ్యాలి.

"చివరి క్షణాల్లో వుంది. మనం వెళ్లాలి!" అన్నాడు జ్ఞానేశ్వర్.

"ఈ రోజా! ఇప్పుడే మసాజ్ చెయ్యించుకొని వచ్చాను" చిరాకుగా మొహం చిట్లించింది జయశ్రీ.

"అయితే ఏమయ్యింది జయా!"

"దుమ్ము ధూళీ... పల్లెటూరు... నాటు దారి... మన కారు వెళ్లదు"

"కారులో కాదు. బస్సులో."

## భౌతిక భోగలాలసత్వం

నేటి ప్రజలకు భౌతిక భోగాలలో వున్న ఆసక్తి మరి దేనిలోనూ లేదు. ప్రభుత్వాలు గూడ తమ ప్రజలు సగటున తల ఒకటికి వాడుకొనగలుగుతున్న విద్యుచ్ఛక్తి, వస్త్రాలు, ఆహార పదార్థాలు, మందులు, కార్లు, నివేశన ప్రదేశాలు, రేడియోలు మున్నుగాగల వస్తువుల పరిమాణాలను బట్టి తాము సాధించిన అభ్యుదయాన్ని నిర్ణయిస్తున్నవి. బాధా విమోచనమే దైనా సేవ్యమేననీ, పరమౌషధమనీ రోగి భావిస్తున్నట్లే అధికారమో, ఐశ్వర్యమో తత్సాధనమో అనుగ్రహించేదేదైనా అభిలషణీయమని ఈనాడు సామాన్య ప్రజానీకమంతా భావిస్తున్నది. ఇప్పటి జీవిత వ్యవస్థ కూడా ఐశ్వర్య అధికారరూప సద్యః ఫలమివ్వని కర్మను పూర్తిగా త్రోసివేస్తున్నది. కావ్యం వల్ల గాని తక్కిన లలితకళాఖండాల వల్లగాని లోకోత్తరానుభూతి కలుగుతున్నదే కాని లౌకికమైన సద్యః ఫలం మరొకటి కలగటం లేదు. కనుక భోగలాలసమైన ప్రజానీకం కావ్యాస్వాదనకు దూరమవుతున్నది.

—డా. జి.వి. కృష్ణారావు

సేకరణ — ఈదుపల్లి

"అమ్మో... నా వల్లకాదండీ!"

"ప్లీజ్... నువ్వలా అంటే ఎలా? కారుకు ఎవడో డాష్ యిచ్చాడు"

"ఆ !"

"సొట్ట తీయించి పెయింట్ వేయించాలి. ఇచ్చి వచ్చాను."

"ఎవరిదైనా కారు తీసుకోండి!"

"జయా! నీ కోసం బుక్ చేసిన కారు రేపో ఎల్లుండో వస్తుంది. ఈలోగా మనం వెలితిపడటం ఎందుకు? ఇప్పుడు కారు యిచ్చిన వాడు కూడా వూరుకోడు కదా! కొత్తకారు ఎరువడుగుతాడు. ఇవ్వగలమా!"

"సర్లెండి బెల్గ్రాం కూడా యిప్పుడే రావాలా?"

"ఏం చేస్తాం! ప్రమాదాలూ, ఇబ్బందులూ చెప్పి రావు కదా! కాలవగట్టున జట్కాబండి ఏర్పాటు చేయించారట. బెల్గ్రాంలో ఆ సంగతి కూడా వుంది."

తీరా బయల్దేరే సమయానికి జ్ఞానేశ్వర్ మెట్ల మీద నుండి జారిపడ్డాడు. నడుం బెణికింది. నర్సింగ్ హోంలో చేరాడు జ్ఞానేశ్వర్.

"ఏమిటే కష్టాలు!" అంది జయశ్రీ.

జ్ఞానేశ్వర్ నీరసంగా నవ్వి, "ఏ కష్టాలైనా తప్పవు మరి! మనకి చాలా ఆస్తి కలిసి వచ్చింది మా మేనత్త మూలంగానే. చావుబతుకుల్లో వున్నప్పుడు కూడా వెళ్లకపోతే ఏమనుకుంటారు? ముఖ్యంగా మా నాన్నగారసలే వూరుకోరు" అన్నాడు.

"బాబునూ, పనిపిల్లనూ తీసుకొని బయల్దేరు!" అని యిక ఎవరితోనూ చెప్పించుకోనవసరం లేకుండా పల్లెటూరు బయల్దేరింది. బాబుక్కావలసిన పాలసరంజామా. సర్దుతుంది పనిమనిషి.

* * *

బాబు నిద్రకు పడ్డాడు.

బస్సు బయట ఎండ మండిపోతోంది. ఈదురు గాలి వెచ్చగా వడగాలిలాగా మారిపోయినట్టుంది. రెట్టించిన ప్రతాపంతో యిడ్చిపెట్టకొడ్తోంది. బస్సుపై రేకూ, రాడ్స్, సీట్లూ వెచ్చబడిపోయాయి.

జయశ్రీ సంతోషం పావుగంట కూడా నిలబడ లేదు.

కెవ్వున అరచి రైలుకూతలాగా బాబు గుక్క పట్టాడు. జయశ్రీ చేతికి వెచ్చటి తడి తగిలింది. వాడి డ్రాయర్ మార్చి తిరిగి వాడిని నిద్రపుచ్చాలని ప్రయత్నించింది. పంతం పట్టినట్టు వాడు గుక్క పెట్టింది కాస్తా యిక వదలడం లేదు.

"మళ్లీ పాలసీక నోటికి తగలాలమ్మా!" అంది యిందాక సీట్లోంచి లేచి సహకరించిన ప్రయాణీకురాలు.

ఆమె కదిలి నిలబడింది కూడా.

బాబును పనిపిల్ల కప్పగించి సీసాలో పాలపొడి పంచదార వేసి గిలకొట్టడం మొదలుపెట్టింది. పనిపిల్ల చేతుల్లో వుండటం లేదు బాబు. అటూ ఇటూ తన్నుకొంటూ చివరికి తల్లి చేతుల్ని తన్నాడు. అదే సమయానికి ఫ్లాస్క్ యిటు కదలడం, బస్సు సర్కారీ రోడ్డు గోతిలో దూకి తుళ్లింతలతో తిరిగి లేవడం, వేడినీళ్ల జయశ్రీ చేతుల మీద చిలకరించడం — అన్నీ కాకతాళీయ సంఘటనలే అయినా మొత్తం పాలూ పంచదారా వేడినీళ్లూ తుళ్లిపోయి బస్సంతా పార్లిపోవడం మాత్రం తిరుగులేని దురదృష్ట సంఘటనే అయికూర్చుంది.

"ఇప్పుడెలా?"

బాబు మాత్రం మామూలుగా ఏడుపు విడిచి పెట్టడం లేదు. ఈసారి బస్సు ప్రయాణీకులు మొత్తం జయశ్రీవైపు తిరిగారు.

"ఏటోల్లమ్మా... బిడ్డకి పాలియ్యలేదా అమ్మ...!"

అంతవరకూ తలదించుకునే వున్న జయశ్రీ ముందు సీట్లోకి చూచింది. ఆమె మొహం పల్లెటూరి మొహం. ముక్కున పుడక, మధ్య పాపిడి. చెదిరిపోయిన జుట్టు, మెడ మీద ముదురుపచ్చరంగు రవికా నగ్నంగా వున్న ఎడం భుజం — ఆమెలో అచ్చమైన అమాయకత్వం తాండవిస్తోంది.

'నీ కెందుకు?' అన్నట్టు చూచింది జయశ్రీ.

పైకనే ధైర్యం చాలడం లేదు. వచ్చే స్టేజీలో బస్సాపి దిగి పోవడమొక్కటే మార్గం. తర్వాత బస్సు ఎన్ని గంటలకు దొరుకుతుందో?

జయశ్రీకి ఒళ్లు మండిపోతోంది. బట్టలు కట్టుకోవడం కూడా సరిగ్గారాని ఆడది కూడా తనకి సలహా యిచ్చేపాటిదైపోయింది.

"ఏవమ్మా! బాబు గుక్కపట్టేడు. పాలు పడ్డునా!"

ఈసారి జయశ్రీ కింకా మతిపోయింది. ఆ పల్లెటూరి బైతు తన బిడ్డకు రొమ్ముగుడుపుతుందా! ఇంకా నయం! రవిక ధరించాలని కూడా తెలియని మనిషి,

పనిమనిషి దీనంగా చూస్తోంది.

ఎప్పుడూ పాలు కలపని అమ్మగారు యిప్పుడు పాలు కలపబోవడమేమిటి? అవి కాస్తా బస్సు పాలై పోవడమేమిటి? ఇప్పుడేం చేస్తారమ్మగారూ!

"వచ్చే వూళ్లో దిగిపోదాం!" అంది జయశ్రీ

చాలామంది ప్రయాణీకురాండ్రకి బుగ్గల మీదకి వ్రేళ్లు చేరుకున్నాయి. జయశ్రీ గమనించింది. సిగ్గుతో మరింత కుంచించుకుపోయింది.

"ఫర్లేదమ్మా! తల్లి పాలకంటులేదమ్మా!" ఎదుటి పల్లెటూరి తల్లి సముదాయించింది.

ఇంకేముంది? తల్లిపాల పురాణం ఈ ఘట్టానికి వచ్చేటప్పటికి చుట్టుపక్కల అదే పనిగా చూస్తోన్న ప్రయాణీకురాళ్లు వంత పాట లంకించుకున్నారు. పండు ముత్తయిదువైతే మరో అడుగు ముందుకు వేసి బిడ్డనందుకుని పల్లెటూరి తల్లి కందించింది.

బాబు ఆరున్నొక్కరాగం శృతి పెంచాడు. బస్సు టాప్ లేచిపోతోంది. ప్రయాణీకులెవ్వరికీ మనశ్శాంతుల్లేకుండా పోయాయి. జయశ్రీ తిరిగి తన బిడ్డను అందుకోవాలని చూచింది. అప్పటికే పల్లెటూరి తల్లి వాడికి రొమ్ము గుడుపుతోంది. పుట్టిన చాలా కాలానికి వాడిక్కావలసిన అపురూప సంపద లభించినట్టు రెండు చేతుల్తోనూ ఆమె రొమ్ము పట్టుకుని కడుపు నిండా పాలు తాగుతున్నాడు.

జయశ్రీకి ఒళ్లు జలదరిస్తోంది. ఆమె ఎంత అనాగరికంగా వుంది. మరో బిడ్డకు పాలిచ్చే ముందైనా శుభ్రపడాలన్న ఆలోచనే లేదామెకు. తన బిడ్డ ఎంగిలినే ఎదుటివాళ్ళ బిడ్డకూ పట్టాలన్న ఆమె కుత్సితపు టాలోచనకి జయశ్రీకి చాలా కోపం ముంచుకొస్తోంది.

కాని... ఏం చేయగలదు! చుట్టుపక్కలున్న వాళ్లంతా ఆమె పక్షం మాట్లాడటమొక్కటే కాదు.

బాబు విచిత్రంగా ఏడుపు మర్చిపోయి తదేక ధ్యానంతో పాలు తాగుతున్నాడు.

బస్సు యథావిధిగా పోతోంది. తర్వాతి స్టేజ్‌లో ఆగింది బస్సు. అప్పటికి బాబు ఆకలి ఆవేదనా తీరినట్టుంది. నిశ్చింతగా త్రేంతలు కొడుతున్నాడు. అదో శుభ పరిణామం. జయశ్రీకి తన బిడ్డ తిరిగి దక్కాడు. జయశ్రీ నిట్టూర్చింది. తనకిప్పుడే మాత్రం వీలు కుదిరినా బాబును మొత్తం డెట్టాల్‌లో ముంచి లేవనెత్తేది. వాడు పాలు తాగిన తీరు. చూస్తుంటే ఆమె కంత కంపరంగా వుంది.

"ఎంతదాకా ఎల్తరమ్మా?" అడిగింది పల్లెటూరి తల్లి.

చెప్పక తప్పలేదు జయశ్రీకి.

పల్లెటూరి తల్లి నిట్టూర్చి, "ఇంత గాలువులో దిగతరమ్మ? అయ్యో... గొడుగైనా తెచ్చుకోరా!" అంది.

"టర్కిష్ టవలుంది. తల మీద వేస్తాను. బస్సు దగ్గరికి జట్కా వస్తుంది."

"ఎంత జటకా అయితే మాత్రం! ఎర్రటి ఎండ... నిప్పులు పెరుగుతావుంటే ఎలా ఎల్తరమ్మ! బిడ్డకి పాలు కూడా లేవు!"

జయశ్రీ యిక పట్టించుకోలేదు కాని బస్సు ఆమెనూ, పసిపిల్లనూ, పసివాడ్ని నిర్దాక్షిణ్యంగా విడిచి పెట్టి విందుగర్భిణిలాగా కదుల్తోన్నప్పుడు తప్ప పల్లెటూరి తల్లి అన్న నాలుగు ముక్కలూ వాస్తవంగా కనిపించాయి కాదు. జట్కా లేదు. చుట్టుపక్కల నర సంచారమూ లేదు. పల్లెటూరికి దారి తీసే రాదారి ఒంటరిగా ఎండలో కమిలిపోతోంది.

తనను దిగవిడిచి వెళ్తొన్న బస్సు వైపూ, దాని నిర్దయత్వం వైపూ కసిగా చూస్తోంది జయశ్రీ.

బస్సు నాలుగడుగులు వెళ్ళి ఆగిపోయింది.

పల్లెటూరి తల్లి తన బిడ్డతో, చిన్న మూటతో దిగింది. జోళ్ళు లేని కాళ్లతో జయశ్రీ వైపు పరుగెత్తుకుంటూ వచ్చింది.

జయశ్రీకిసారి అరికాలి మంట నెత్తికెక్కిపోయింది.

బస్సులో ఉన్నంతసేపూ తన స్వతంత్రాన్ని పీక్కుతినేసింది! బలవంతంగా కృతజ్ఞతా భావం ప్రదర్శించుకోవలసిన యిబ్బందిలో పడింది. రకరకాల పిచ్చి ప్రశ్నలు వేసి తన ప్రాణాలు తోడేసింది కూడా.

ఇక్కడెందుకు దిగింది?

బాబు నెత్తి మీద టర్కిష్ టవల్ కప్పింది పసిపిల్ల.

పల్లెటూరి తల్లి వైపు పరీక్షగా చూస్తూ చెట్టు నీడకు చేరుకుంది జయశ్రీ. పసిపిల్ల బాబుతో సహా జయశ్రీ వెంట కదిలింది.

ఆమె కూడా నీడలోకి వచ్చి ఆగింది.

ఆమె వైపు చిరాకుగా చూస్తోంది జయశ్రీ

"ఏందుకు నన్ను వెంబడిస్తోన్నావు?" అడిగింది జయశ్రీ.

ఆమె కర్థం కాలేదు.

"నువు కూడా యిక్కడే దిగావా?" తిరిగి అడిగింది జయశ్రీ.

ఆమె తల అడ్డం తిప్పింది.

"డబ్బు కావాలా?"

"ఎందుకండమ్మగోరూ?"

"బాబుకి పాలు యిచ్చి ఏడుపు ఆపినందుకు!"

పల్లెటూరి తల్లి విచిత్రంగా చూచింది.

"ఎంతిస్తావేటమ్మగోరూ!" అడిగింది చివరికి.

"అడుగు... తల్లి పాలకు విలువ కట్టలేం కదా!"

"నిజవమ్మగోరూ... తల్లి యిచ్చే పాలకి యిలువేటుండమ్మా! యిలవలేదమ్మా! నేను డబ్బులందుకోవటానికి దిగబడిపోలేదమ్మగారూ! తమరు జటకాబండి రాకపోతే బిడ్డతో, బిడ్డ ఆకలితో శాన యిబ్బంది పడిపోతారమ్మగోరూ! తమని వూరి వరకూ దింపి తిరిగి ఎల్లిపోదామని..."

జయశ్రీ అప్పటికే ఆమె పాదాలు పట్టుకుంది.

* * *

ఆ సాయంకాలం జ్ఞానేశ్వర్ గ్రామం వచ్చేటప్పటికి మేనత్త కులాసాగా వుండటంగాక, జయశ్రీ తన ఒడిలో బాబును పడుకోబెట్టుకుని తదేకంగా పాలు గుడపడంలో లీనమైపోయి వుండటం చూసేసరికి... తల తిరిగిపోయి, కళ్ళలో తడి ఉబికింది.

◆◆

## * సమస్యాపూరణం *

10-4-92, సంచిక పూరణలు

సమస్య: "విద్యలె ప్రతిబంధకములు విద్యార్థులకున్!"

పూరణ: ఉద్యోగార్థము చదివెడి
విద్యార్థుల కేలనుండు విజ్ఞాన సుధల్?
విద్యల విలువలు తెలియని
విద్యలె ప్రతిబంధకములు విద్యార్థులకున్-

— పూరణ: వి.వి. సత్యప్రసాద్ విజయవాడ

"బాధ్యతలెరుగని పెద్దలు
విద్యను 'ప్రైవేటు' చేయ వేదనరగిలెన్
మిథ్యావాదము పెంచిన
విద్యలె ప్రతిబంధకములు విద్యార్థులకున్!"

—భైరవభట్ల దేవీప్రకాశ్, విజయనగరం

సేద్యము చేసిన పిడికెడు
ఖాద్యము లభియించు నన్ను గాని? భవితలో
ఉద్యోగ మీని "ప్రస్తుత
విద్యలె" ప్రతిబంధకములు - విద్యార్థులకున్.

— బందరు దుర్గాప్రసాద్, కవిటి

గద్యము సరిగా చదువరు,
పద్యము చదవంగబూన పదు నిక్కట్టుల్
హృద్యము లెరుగని దినమున
విద్యలె ప్రతిబంధకములు విద్యార్థులకున్

— గొల్లమందల ఇశ్రాయేలు, గార్ల

## ఈ వారం సమస్య * * * * * * * * *

పేదరికము నందె కవిత వెలుగొందు జుమీ!

(వివరణ: కవిత్వానికి పేదరికం, భాగ్యం అనే భేదం లేదు. అయినా, పేదరికంలోనే కవిత్వం వెలుగొందుతుందట!

నిర్వహణ: మంత్రాల రామకృష్ణశర్మ